## క్లుప్తంగా

### విజేతలకు బహుమతుల ప్రదానం



గట్టు: మండల పరిధిలోని బోయలగూడెం గ్రామంలో విజయదశమి సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ టోర్నీ విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. పోటీల్లో మొత్తం 8 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నీ విజేత రాకేష్ జట్టు నిలువగా మొదటి బహుమతి రూ.3,000లతో పాటు కప్పును వాల్మీకి నాగరాజు, లింగన్న అందజేశారు. ద్వితీయ బహుమతి వంశీ టీంకు కానిస్టేబుల్ సీతారాములు నగదు, కప్పు, తృతీయ బహుమతి వీరేష్ టీంకు తిమ్మప్ప రూ.1,000, కప్పు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

### గ్రూప్–1 ఉద్యోగికి సన్మానం



మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వుకు చెందిన రాణాప్రతాప్ సింగ్, ఎంబీబీఎస్ విద్యార్థి బస్వరాజును శనివారం కాంగ్రెస్ నాయకులు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాణాప్రతాప్ సింగ్ గ్రూప్–1ఉద్యోగం సాధించడం, బస్వరాజు ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు రామిరెడ్డి, కృష్ణ, వెంకటన్న, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి సేవలో వడ్డేపల్లి వాసులు



శాంతినగర్: తిరుమల శ్రీనివాసుని సేవలో వడ్డేపల్లి మండల భక్తులు పాల్గొని భక్తులకు సేవలందించారు. టీటీడీ ఆహ్వానం మేరకు ఈ నెల 1వ తేదీ నుంచి 7 వరకు సేవలందించనున్నట్లు వారు తెలిపారు. నారాయణగిరి షెడ్లలో భక్తులకు పాలు, ఆహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

### ఘనంగా ఉత్సవ విగ్రహ ఊరేగింపు



అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారితో పాటు శ్రీచక్ర స్నానాన్ని తుంగభద్రా నదిలో శనివారం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల గుండా ఊరేగింపుగా మేళతాలతో తీసుకెళ్లి నదీ స్నానాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి సత్యం, కోశాధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

### పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



ఆత్మకూర్: పోరాటాలతోనే అనేక ప్రజా సమస్యలు పరిష్కారమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐ పార్టీకి ప్రజల తరపున మద్దతు లభిస్తోందని, అన్ని స్థానాల్లో పోటీ చేసి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి లక్ష్మీనారాయణశెట్టి, జిల్లా నాయకులు శ్రీహరి, సీఎస్‌శెట్టి, రాబర్ట్, మోష, బాలరాజు, బాలకృష్ణ, లింగన్న, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు విద్యార్థులకు సదావకాశం



కేటీదొడ్డి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు(ఫైల్)

- ఎనిమిదో తరగతి వారికి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్
- అక్టోబర్ 6 వరకు దరఖాస్తు గడువు
- నవంబర్ 23న పరీక్ష

కేటీదొడ్డి: గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక పరిస్థితులు అనుకూలించక నిరుపేద విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. అలాంటి వారికి ఆర్థిక చేయూత అందించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో చదువుతున్న ఎనిమిదో తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అందిస్తోంది. ప్రతిభ కలిగిన వారి ఉన్నత చదువులకు తోడ్పాటు అందిస్తోంది. 2025–26 విద్యా సంవత్సరంలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నవంబర్ 23న అర్హత పరీక్ష నిర్వహించనుండగా అక్టోబర్ 6 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉంది.

**దరఖాస్తు ఇలా**

జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలలు 460 ఉండగా 57,138 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ఎనిమిదో తరగతి విద్యార్థులు 6,034 మంది ఉన్నారు. 2024–25 లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 785, ఎంపికైన వారు 48 మంది. 2025–26కు దరఖాస్తులు వచ్చినవి– 216. ప్రతి సంవత్సరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు రూ.12 వేలు స్కాలర్‌షిప్ అందుతుంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హులు వీరు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఫారం తీసుకుని వివరాలు నింపాలి. వాటితో పాటు ఓసీ, బీసీ, మైనార్టీలు రూ.100 ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.50 డీడీ తీసి దరఖాస్తును జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలోని అందించాలి. నవంబర్ 23న దేశ వ్యాప్తంగా ఒకేసారి అర్హత పరీక్ష నిర్వహిస్తారు. మెరిట్ ఆధారంగా స్కాలర్‌షిప్ అందిస్తారు.

**విద్యార్థులను ప్రోత్సహించాలి**



జిల్లాలోని ఉన్నత పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రోత్సహించి దరఖాస్తు చేయించాలి. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో అర్హత సాధిస్తే ఇంటర్ వరకు ఏటా రూ.12 వేలు స్కాలర్‌షిప్ అందుతుంది. ప్రధానోపాధ్యాయులు దృష్టి సారించి పరీక్ష రాయించాలి.

– శ్రీనివాసులు, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి

**అర్హతలు ఇవే**

8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. ఏడో తరగతి వార్షిక పరీక్షలో 55% మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులు 50% మార్కులు ఉన్నా అర్హులు. ప్రభుత్వ మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతూ ఉండాలి. ఆదర్శ పాఠశాలల విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. వసతి గృహాల్లో చదివేవారు అర్హులుకారు. ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి బోనఫైడ్ జత చేయాలి. జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎక్కువ మంది ఏటా స్కాలర్‌షిప్‌నకు అర్హత సాధిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**పరీక్ష విధానం**

మల్టీపుల్ చాయిస్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. మొత్తం 180 మార్కుల ప్రశ్నాపత్రం రెండు విభాగాలుగా ఉంటుంది. పార్ట్ ఏలో మానసిక సామర్థ్య పరీక్ష 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. ఇందుకో కోడింగ్, డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు వెన్ చిత్రాలు, మిర్రర్ చిత్రాలు, వాటర్ ఇమేజెస్, రీజనింగ్ ఎబిలిటీ, సంఖ్యాశాస్త్రం పదాల భిన్నాలు, నంబర్ అనాలజీ అల్ఫాబెట్ అనాలజీకి సంబంధించిన అంశాలు ఉంటాయి. పార్ట్ బీలో 30 మార్కులు సామాన్యశాస్త్రం 8వ తరగతి సంబంధించిన 30 ప్రశ్నలకు 30 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మీడియాల్లో అందిస్తారు.

# ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి



అలంపూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న సంపత్‌కుమార్

అలంపూర్ రూరల్/ఉండవెల్లి/మానవపాడు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సమిష్టిగా కృషి చేసి విజయఢంకా మోగించాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. అలంపూర్ పట్టణంలోని బీఆర్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి పార్టీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు ఇస్మాయిల్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దొడ్డెప్ప, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలిశ్రీనివాసులు, వచ్చర్లకుమార్ తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను గెలవాలని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఉండవెల్లి మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో స్థానిక ఎన్నికల సమావేశంలో ఆయన పాల్గొని పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

■ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. మానవపాడు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు రవాణా మెంబర్ సతీష్‌రెడ్డి, జిల్లా డీసీసీ కార్యదర్శి మహ్మద్ సిరాజ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్‌మోహన్‌నాయుడు, మాజీ జెడ్పీటీసీ మద్దిలేటి, మాజీ ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, పరమేష్‌నాయుడు, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి

మల్దకల్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి , తహసీల్దార్ ఝాన్సీరాణి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అధికారులకు సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజశేఖర్, ఎస్ఐ నందీకర్, సూపరింటెండెంట్ నర్సన్న, సీనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్‌రెడ్డి, నాయకులు గోవిందు, వీరేష్‌గౌడ్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను తక్షణమే శిక్షించాలి



అయిజలో నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

అయిజ: మహిళ మృతికి కారణమైన నిందితులను తక్షణమే శిక్షించాలని మాల మహానాడు నాయకుడు వీరేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మాలమహానాడు నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రియాంకను గట్టు మండలం చిన్నోనిపల్లికి చెందిన కానిస్టేబుల్ రఘుగౌడ్ ప్రేమ పేరుతో వంచన చేశాడని, ప్రియాంక ఆత్మహత్య చేసుకోవడానికి కారణమయ్యాడని ఆరోపించారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకొని కఠిన శిక్షలు విధించాలని కోరారు. కార్యక్రమంలో వీరేష్, నాగరాజు, తాయప్ప, సురేష్, రంగస్వామి, పరమేష్, మునిస్వామి, సురేష్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఘటన శనివారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ రవినాయక్ తెలిపిన వివరాలు.. వనపర్తి డిపోకు చెందిన టీఎస్32 టీ 4778 నంబర్ గల ఆర్టీసీ బస్సు వనపర్తి నుంచి కర్నూలుకు జాతీయ రహదారిపై జింకలపల్లి స్టేజీ గుండా వెళ్తుండగా అదే దారి గుండా వెళ్తున్న కేఏ21 జెడ్ 1966 కారు డ్రైవర్ లెడెన్ అతివేగంగా వచ్చి వెనుక నుంచి బస్సును ఢీకొట్టాడు. ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురు ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఆర్టీసీ బస్సు డ్రైవర్ జయపాల్‌రెడ్డి చాకచక్యంగా వ్యవహరించి బస్సును అదుపు చేయడంతో హైవేపై ప్రమాదం తప్పింది. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై కొంత మేరకు ట్రాఫిక్ జాం ఏర్పడింది.




# ఎయిడ్స్ నివారణపై కళాజాతా



మల్దకల్‌లో అవగాహన కల్పిస్తున్న కళాకారులు



అయిజలో హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మల్దకల్: ఎయిడ్స్ నివారణపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని చౌరస్తాలో స్వర్ణమాధురి జానపద కళాకారుల బృందం అవగాహన కల్పించారు. ఎయిడ్స్ సంక్రమించే లక్షణాలు, నివారణ సూచనలు గురించి వివరించారు. ఎయిడ్స్‌ను నివారించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఫరీద్, కళాబృందం సభ్యులు సుధాకర్, సుజాత, వసంత, లక్ష్మణ్, శ్రీనివాస్, యాదగిరి, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్‌పై అవగాహన**

అయిజ: స్వర్ణ మాధురి జానపద కళాకారులు ఆట, పాటలతో శనివారం మండల కేంద్రంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ వైరస్ వ్యాప్తి, నివారణ చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా కళాకారుడు మనోహర్ మాట్లాడుతూ.. అసురక్షిత శృంగారం, రక్తమార్పిడి, వ్యాధిగ్రస్తుడు వాడిన బ్లేడ్, తదితర చర్యల గుండా హెచ్‌ఐవీ వ్యాపిస్తుందన్నారు. హెచ్‌ఐవీ సోకినట్లు అనుమానం ఉన్నవారు తక్షణమే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీను అశోక్, యాదగిరి, రాజు, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం



ఇటిక్యాలలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



చాగాపురంలో రక్షణ కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బుడ్డారెడ్డిపల్లిలో రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

ఇటిక్యాల: మండలంలోని రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు, దీలాగా ఉన్న విద్యుత్ వైర్ల వద్ద ప్రమాదం పొంచి ఉందంటూ ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కంచె వేయడం లేదని, విద్యుత్ వైర్లు వేలాడుతున్నా అదనపు స్తంభాలు వేయడం లేదంటున్నారు. రెండు నెలల క్రితం బుడ్డారెడ్డిపల్లిలో రోడ్డు పక్కన్న ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రెండు గొర్రెలు విద్యుత్ షాక్‌తో మృతిచెందాయి. ఏడాది క్రితం అదేచోట మేతమేస్తూ పాడిగేదె, గొర్రె మృతి చెందింది. ఇటిక్యాలలో ఇళ్ల మధ్యలో విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్న, స్థానిక విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# సేవనే పరమార్థంగా భావించాలి



పాఠశాలలో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

గద్వాల: ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సేవనే పరమార్థంగా భావించాలని గుంటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రభాకరశాస్త్రి అన్నారు. శనివారం గుంటిపల్లిలో పాఠశాల ఆవరణలో గద్వాల ప్రభుత్వ జూనియర్ కాలేజీ(కోఎడ్యుకేషన్) విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే సేవా భావంతో కూడిన జీవితాన్ని అలవర్చుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని హెచ్‌ఎం సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు పవన్‌కుమార్, వీరేషం తదితరులు పాల్గొన్నారు.



## టోల్‌ప్లాజా వద్ద పోటెత్తిన వాహనాలు

రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు క్యూ కట్టాయి. శనివారం దసరా సెలవులు ముగించుకొని ఆంధ్ర నుంచి తెలంగాణలోకి ప్రవేశిస్తున్న వాహనాలు ఒక్కసారిగా పోటెత్తాయి. టోల్ రుసుం చెల్లింపు నేపథ్యంలో అర కిలోమీటర్ మేర ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు పడ్డారు. – ఉండవెల్లి

# రోడ్ల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడో..?

- రెండేళ్లయినా పూర్తిగాని బీటీరోడ్ల పనులు
- కంకర వేసి వదిలేసిన కాంట్రాక్టర్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



గుంతలమయంగా వడ్డేపల్లి అంతర్రాష్ట్ర రహదారి



బురదమయంగా తనగల రహదారి

శాంతినగర్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారితోపాటు ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్ల పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో మూడు రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. కంకర వేసి వదిలేయడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పనులు మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్లు**

■ శాంతినగర్ నుంచి వడ్డేపల్లి పొలిమేర వరకు మూడు కిలోమీటర్ల ప్రధాన రహదారికి రెండేళ్ల క్రితం ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద రూ.2.16 కోట్లు మంజూరయ్యాయి. పనులు మొదలుపెట్టిన కాంట్రాక్టర్ పాత బీటీ రోడ్డును తొలగించి కంకర పరిచాడు. నెల రోజుల పాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు వదిలేసి వెళ్లిపోయాడు.

■ జక్కిరెడ్డిపల్లి నుంచి తుమ్మిళ్ల వరకు పది కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి గుంతలమయంగా ఉండటంతో ఏడాది క్రితం ఎంఆర్ఆర్ గ్రాంట్ కింద రూ.2.56 కోట్లు మంజూరయ్యాయి. పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ గుంతలు పడిన చోట ప్యాచ్ వర్క్ పనులు చేపట్టేందుకు జేసీబీలతో పాత రోడ్డును తొలగించి వదిలేశాడు.

■ వెంకటాపురం స్టేజి నుంచి పెద్దధన్వాడ వరకు పీడబ్ల్యూడీ పథకం కింద రూ.2.68 కోట్లు మంజూరయ్యాయి. పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ నెల రోజులపాటు ప్యాచ్ వర్క్ వేసేందుకు పనులు చేపట్టాడు. జేసీబీతో ఉన్న రోడ్డును తొలగించి వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో వడ్డేపల్లి, రాజోళి, అయిజ మండలాలకు చెందిన ప్రయాణికులతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మధ్యలోనే వదిలేసిన రోడ్లు నిర్మాణ పనులు పూర్తి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**గుంతల్లో వెళ్లలేక పోతున్నాం**

మా పొలాలు వడ్డేపల్లి రోడ్డు సమీపంలో ఉన్నాయి. నిత్యం పొలాలకు వెళ్లాల్సి ఉంటుంది. పొలిమేర వరకు పాత రోడ్డును తొలగించి కంకర పోసి వదిలేశారు. భారీ ఇసుక, ఎర్రమట్టి టిప్పర్లు ఆరులైన్ల రోడ్డుకు వెళ్లడంతో రోడ్డు గుంతలయమంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

– విజయమోహన్‌రెడ్డి, వడ్డేపల్లి

**బురదమయంగా రోడ్డు**

వెంకటాపురం స్టేజి నుంచి తనగల వరకు ఉన్న రోడ్డు బురదమయంగా మారింది. వర్షం కురిస్తే కాలినడకన వెళ్లలేని పరిస్థితి వుంది. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నాం. కాలేజీకి వెళ్లే విద్యార్థులు వెంకటాపురం స్టేజి వరకు కాలినడకన వెళ్తుంటారు.

– చాకలి బీసన్న, తనగల, వడ్డేపల్లి మండలం

**పనులు మొదలుపెడతాం**

వడ్డేపల్లి రోడ్డుకు సంబంధించిన బిల్లు ఇటీవల కాంట్రాక్టర్‌కు చెల్లించాం. వర్షాలు తగ్గిన వెంటనే మొదలుపెడతాం. జక్కిరెడ్డిపల్లి, తనగల రోడ్లకు సంబంధించిన కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు వదిలేసి వెళ్లారు. ప్యాచ్ వర్క్ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు.

– రెడ్డప్ప, డీఈ, పంచాయతీరాజ్‌శాఖ, మానవపాడు డివిజన్